# కృష్ణుడు కాదు, రాముడు

"మాలతీ, నేనలా బయటకు వెళ్తున్నాను. ఒక గంటలో వచ్చేస్తాను" చెప్పులేసుకుని బయటకు వెళ్తూ కేకేశాడు జగన్నాథం.

"తొందరగా వచ్చేయండి. మరీ రాత్రయితే భోజనానికి ఆలస్యం అవుతుంది. తర్వాత అరగదు మళ్ళీ."

"అలాగే! తలుపేసుకో"

వీధి తలుపు గడియపెట్టి లోపలికి వచ్చింది మాలతి.

ఇద్దరు కొడుకులూ పెద్ద చదువులు చదివి మంచి ఉద్యోగాల్లో అమెరికాలో ఒకడు, ఢిల్లీలో ఒకడు- స్థిరపడ్డారు. కొడుకులు తమవద్దకొచ్చి వుండమని కోరినా జీవితపు శేష అధ్యాయాన్ని కూడా ఇక్కడే గడిపేయాలని నిశ్చయించుకున్నారు వాళ్లిద్దరూ.

ఒంటరిగా వున్న మాలతికి గతం తాలూకు జ్ఞాపకాలూ... కళ్ళముందు కదలాడ సాగాయి.

★ ★ ★

బీచ్‌కి దగ్గరగా ఆ ఇల్లు. మాలతి, జగన్నాథం పిల్లల్ని తీసుకుని మూడురోజుల కొకసారి బీచ్‌లో కూర్చుని వచ్చేవారు. అక్కడ ఎవరైనా అందమైన అమ్మాయిలు కనబడ్తే చాలు, జగన్నాథం రెండుకళ్ళూ అటే అతుక్కుపోయేవి.

"ఓహ్, ఎంత అందంగా వుంది ఆ అమ్మాయి! నున్నటి చెక్కిళ్ళు, తడి ఆరని పెదవులు, నిండైన గుండె, సన్నని నడుం, ఇంకా; అబ్బ! వెనక నుండి వెళ్ళి అమాంతం కౌగిట్లో బంధించాలని వుంటుంది ఏ మగాడికైనా." అమ్మాయిల అందాల్ని చూపుల్తోనే తాగేస్తూ అనుకునేవాడు జగన్నాథం.

బీచ్‌లో రకరకాలరూపాల, కుటుంబాల సంప్రదాయాల అమ్మాయిలను, ఎక్కువ బాహ్యాకర్షణతో వుండే ఫారిన్ అమ్మాయిలను చూడ్డానికే జగన్నాథం బీచ్‌కి వెళుతు న్నాడని తెలుసుకుని మాలతి బాధపడింది.

బీచ్‌కి వెళ్ళొద్దు అంటే కథ అడ్డం తిరుగుతుంది. మనలో చాలామందికి ఏది వద్దంటే అదే చేసే మనస్తత్వం వుంటుంది. అందుకే పిల్లల ముందు భర్తతో వాదనకు దిగకుండా ఒక కొత్త ఆలోచనతో బీచ్‌కి వెళ్ళింది మాలతి.

బీచ్‌కి వెళ్ళినప్పుడు మాలతి రెట్టించిన ఉత్సాహంతో సముద్రకెరటాల్ని, కెరటాలతో ఆడుకునే అమ్మాయిల్ని, అబ్బాయిల్ని చూస్తూ కూర్చుంది కాసేపు.

పిల్లలు దూరంగా పిచ్చుకగూళ్ళు కట్టుకుంటున్నారు.

"అతను చూడండి, ఎంత హేండ్సమ్‌గా వున్నాడో! గుండెలమీద దట్టంగా పెరిగిన జుత్తు. వెడల్పయిన ఛాతీ, బొద్దింకల్లాంటి మీసాలు, చెదిరిన జుత్తు, రఫ్‌గా... మాన్లీగా... ఓహ్... ఏం

పర్సనాలిటీ అండీ. చూడండి ఎంతో బాగున్నాడు కదూ!?" అంటూ చిలిపిగా జగన్నాథం కళ్ళల్లోకి చూసింది మాలతి.

జగన్నాథం అప్పటికే అయిష్టంగా ముఖం పెట్టాడు. "చాల్లే. పెళ్ళయిన ఆడదానివి అలా ఇంకో మగాడ్ని రెండుకళ్ళూ పెట్టుకు చూడొచ్చా? ఏంటా పెడబుద్ధులూ నువ్వూనూ!" కోపంగా అన్నాడు.

"బాగుందండీ. నేను పెళ్ళయినదాన్ని అయితే మీరు పెళ్ళయినవారు కాదా? మరి మీరు అమ్మాయిల్ని చూస్తూ వాళ్ళని అంగాంగ వర్ణన చేసినప్పుడు నేను ఏమైనా అన్నానా?" మూతిముడిచింది మాలతి.

"నీతో చావలేం. ఏమాటన్నా నాకే తిప్పి కొడ్తావు." అనేసి లేచాడు.

"పద ఇంటికెళ్ళిపోదాం. పిల్లలు చదువుకోవాలి కదా!" అన్నాడు.

'అదీ. అలా రండి దారికి.' అనుకుంది మనసులో.

అప్పట్నుంచీ ఎప్పుడైనా ఎక్కడైనా ఏ అమ్మాయిని చూసినా మరి నోరెత్తేవాడు కాదు. తనలాగే తన భార్యకూడా చేస్తే... హమ్మో... అన్న ఆలోచన అతన్ని పిరికివాడిని చేసేసింది పాపం.

★ ★ ★

మరి కొన్నాళ్లకు మళ్ళీ మరొక సమస్య ఎదుర్కోవలసి వచ్చింది. జగన్నాథంది మంచి పర్సనాలిటీ. అందగాడికిందే లెక్క. ఈ మధ్య ఆఫీసు నుంచి ఆలస్యంగా ఇంటికి రావడం మొదలెట్టాడు. వాళ్ళ ఆఫీసులో కొత్తగా ఒక టైపిస్ట్ అమ్మాయి చేరినట్టు తెలిసింది మాలతికి.

ఈయనగారు ఆ కొత్తమ్మాయితో బీచ్‌లకి షికార్లు కొడుతున్నారేమోనని అనుమానం కలిగింది మాలతికి. అనుమానం అన్నది మనసులో కలగకే పోవాలిగాని ఒకసారి అనుమాన బీజం మొలకెత్తిందంటే చాలు మహావృక్షమై పోతుంది.

ఈ సమస్యని భర్త మనసు నొప్పించకుండా ఎలా పరిష్కరించాలో అర్థంగాక మాలతి మనసు మౌనంగా రోదించింది. జీవితంలో ఓడిపోవడం ఆమెకు నచ్చదు. ఓడిపోతాననే భయంతో వెనక్కి అడుగువేసేకంటే గెలుస్తాననే నమ్మకంతో ముందడుగు వెయ్యడం మంచిదని ఆమె అభిప్రాయం.

"ఏవండీ! ఆఫీసు నుండి తొందరగా వచ్చేస్తూ వుండండీ" షర్ట్ గుండీలు పెడుతూ మురిపెంగా అతని కళ్ళల్లోకి చూస్తూ అంది మాలతి.

"ఏం, ఎందుకట?" అన్నాడు చిలిపిగా అతను.

"ఏం లేదు. అన్నట్టు... మీకీ విషయం చెప్పడం మర్చిపోయాను. నేను కాలేజీలో చదివేటప్పుడు మా క్లాస్‌మేట్ రవీంద్ర అని వుండేవాడు. ఈమధ్య నేను వూరికే వీధి అరుగుమీద నిలుచుంటే అతను కనిపించి చొరవగా లోపలికి వచ్చాడు. ఇక్కడే ఏదో కంపెనీలో పని చేస్తున్నాడట. చాలా స్మార్ట్‌గా వున్నాడు. రోజూ వచ్చేస్తున్నాడండీ. నాకు భయంగా వుంది. అతని మాటలు... చేష్టలు... చూపులు... ఎందుకో నన్ను గాభరా పెడుతున్నాయి. ముఖ్యంగా పిల్లలు కాన్వెంట్ నుండిరాని సమయంలో వస్తున్నాడు. వచ్చినవాడిని ఎలా వెళ్ళిపొమ్మని అనడం చెప్పండి. ఆడదాన్ని, ఒంటరిదాన్ని, పిల్లలు చూస్తే చిన్నవాళ్ళు. ఇరుగుపొరుగుల సంగతి మీకు తెలుసు. ఎవరూ

పట్టించుకోరు. ఇహ వచ్చాడంటే ఒకటే పొగడ్తలు. 'మాలతీ యు ఆర్ లుకింగ్ వెరీ చార్మింగ్! నీకు పెళ్ళై ఇద్దరు పిల్లలు వున్నారంటే ఎవరూ నమ్మరు. ఇంకా పెళ్ళికాని అమ్మాయిలా కనిపిస్తున్నావు" అంటూ నావైపు అదోలా చూస్తున్నాడండీ. మొన్నయితే 'బీచ్‌కి వెళ్దాం వస్తావా?' అని కూడా అడిగాడు."

అప్పటికే జగన్నాథం మొహం కోపంతో ఎరుపెక్కింది. దవడలు బిగుసుకున్నాయి. "రాస్కెల్. రానీ వాడ్ని; మక్కెలువిరగతంతాను. ఇలాంటి వెధవలకి మతి పోతుంది వాడికెలా బుద్ధి చెప్పాలో నాకు బాగా తెలుసు. ఇవాళ ఆఫీసు నుంచి తొందరగా వచ్చేస్తాలే. నువ్వు మాత్రం జాగ్రత్తగా వుండు."

జగన్నాథం వెళ్ళిపోయాక - హమ్మయ్య - అని నిట్టూర్చింది మాలతి.

సాయంత్రం జగన్నాథం తొందరగా వచ్చేశాడు ఆఫీసు నుండి. "మాలతీ! ఏడీ, నీ బాయ్‌ఫ్రెండ్? ఇంకా రాలేదా?" అన్నాడు.

మాలతి తడబడింది "మీరు వస్తారని తెలిసిపోయుంటుంది. అందుకని రాలేదేమో" అంది భయంగా. 'అసలు రవీంద్ర అన్న పేరు గల వ్యక్తి వుంటేకదా రావడానికి. ఇదంతా ఆఫీసునుంచి ఆయన తొందరగా ఇంటికి రావడానికి తను ఆడిన నాటకం అని అతనికి తెలీదు' అని ఆనందంగా అనుకుంది.

అప్పట్నుంచి రోజూ ఆఫీసు నుండి తొందరగా ఇంటికొచ్చేసేవాడు జగన్నాథం.

ఇది జరిగిన మరికొన్ని నెలలకే మరొక చిత్రమైన సమస్య ఎదురైంది. పిల్లల్ని తీసుకుని దసరా సెలవులకని పుట్టింటికి వెళ్ళింది మాలతి. అక్కడ అమ్మ, నాన్న, అన్నయ్య, వదిన అందరూ బలవంతం చేస్తే వారం రోజులు వుండిపోయింది.

వచ్చిన మర్నాడే ఆఫీస్ పిక్నిక్.

పిక్నిక్‌లో అందరూ అడిగారు "మీరు ఇన్నాళ్ళు వుండిపోయారేంటి" అని.

మాలతి ఆశ్చర్యపోయింది. ఎన్నాళ్ళు? మహా అయితే వారం రోజులు. వాళ్ళెవరూ పుట్టింటికెళ్ళరా? అనుకుంది.

ఈ కుటుంబం ఒక పెద్ద ఇంట్లో ఒక వాటాలో అద్దెకుంటున్నారు. ఇంకా నాలుగు వాటాలున్నాయి. ఒక చిన్న వాటాలో ఒక ఒంటరి అమ్మాయి వుంది. ఉద్యోగం చేస్తోంది. చక్కగా ఉంటుంది. మాలతి ఆ అమ్మాయితో ఎప్పుడూ మాట్లాడలేదు. మాట్లాడితే ఆ అమ్మాయి ఇంటి కొచ్చేస్తుందేమో! వచ్చేస్తే... తనతో తన భర్తతో పరిచయం పెరుగుతుందని ఎప్పటికప్పుడు జాగ్రత్తపడేది.

ఇంకొక వాటాలో ఉండే సావిత్రి అనే ఆమె అంది "మీరు ఇన్నాళ్ళు వుండి పోయారేమిటి? ఇంట్లో మగాళ్ళని అలా ఒక్కళ్ళనీ వదిలేసి వెళ్ళకూడదండీ బాబూ! సామెతే ఉంది కదా; 'పొరుగూళ్ళో ఉన్న మొగుడినీ పొయ్యిమీద ఉన్న కూరనీ ఓ కంట కనిపెట్టుకొనుండా'లని! మీరు విన్లేదా? మంచివారే! అందులోనూ మీ పక్క వాటాలోనే అంత అందమైన అమ్మాయి ఒంటరిగా వుంటోందని తెలిసీకూడా మీరలా వెళ్ళి పోవడం..." అంటూ అదోలా నవ్వింది.

మనసుని కోస్తున్నట్టుగా వున్నాయా మాటలూ, నవ్వూ. ఆవిడ మాటలకి మాలతి పూర్తిగా నీరుగారి పోయింది. ఏడుపొచ్చేసింది.

చిన్నపిల్లలా కన్నీరు కారుస్తున్న మాలతిని చూసి ఏమైందోనని ఓదార్చడానికి అక్కడికి అందరూ చేరారు. జగన్నాథం కూడా పరుగెత్తుకొచ్చాడు.

"ఏమైంది" అని అడుగుతున్న భర్తకు బదులివ్వకుండా కళ్ళు తుడుచుకుని అక్కడ్నుంచి లేచి వెళ్ళిపోయింది.

దూరంగా వున్న చెట్టు కింద ఆశోకవనంలో సీతలాగ కూర్చున్న మాలతికి జగన్నాథం, రామారావు వాళ్ళందరూ ఏదో హడావుడిగా మాట్లాడుకోవడం ఆమె ఓరకంట గమనిస్తూనే వుంది.

మాలతి వున్న చోటుకి జగన్నాథం రామారావుని తీసుకుని వచ్చాడు.

"మాలతీ, నువ్వు మరీ అంత సున్నితం అయితే ఎలాగ? నే చెప్పేది కాస్త విను. రామారావూ నేనూ పందెం వేసుకున్నాం. అలా అంటే నీ చర్య ఎలా వుంటుందో చూడాలని. 'నా మిసెస్ అలాంటి వాటికి తేలిపోదు' అని నేను, 'చూడండి ఎలా రియాక్ట్ అవుతుందో అని ఈయన'."

రామారావు అందుకున్నాడు - "అవునండీ మా సావిత్రికి కూడా చెప్పాం. 'సరే అలాగే చెబుదాం అలాగే చూద్దాం' అని ఆ మాటలు అంది. అంతే మరేం లేదు".

సావిత్రికూడా అక్కడకి చేరింది. "నిజమే నండీ. వాళ్ళిద్దరూ పందెం వేసుకున్నారు. మీవారు ఓడిపోయారు. సారీ... మీరు అలా ఫీలైపోతారనుకోలేదు. అయినా మీరు దేన్నైనా సరదాగా తీసుకుంటారనుకున్నాం!" అంటూ నవ్వింది వాళ్ళిద్దరివైపు చూసి.

మాలతికి ఇదంతా ఏదో గూడుపుఠాణిగాలా అనిపించింది. "ఇవేం సరదాలు! ఛీ. ఇదేం బతుకు? ఛ!" అనుకుని సముద్రంలోపడి చచ్చిపోదామనుకుంది. కాని, మళ్ళీ ఆలోచించుకుంది. ఈ సమస్యకి చావు పరిష్కారం కాదు. ఆయన్ని ప్రేమతోనే జయించాలి.

ఆ రోజు రాత్రి భర్త ఎదమీద వాలి అతని ముఖాన్ని ముద్దుల్లో ముంచెత్తుతూ అంది: "నాకు మీరంటే ప్రాణం. మీరే నా సర్వస్వం అన్న భావంతో వున్నాను. మీరు కూడా అలాగే వుండాలని నా అభిలాష. మిమ్మల్ని ఇంకొక అమ్మాయితో కలిపి చూడ్డం, మాట్లాడ్డం ఊహల్లో కూడా భరించలేను. మీరు మీ భార్యని ఇంకొక మగాడిపక్కన వూహించుకోగలరా? చెప్పండి. నన్ను మీరు భార్యగాకన్నా ముందు ప్రియురాలిగా, స్నేహితురాలిగా చూడండి. ఆ భావనే నాకెంతో తృప్తినిస్తుంది. వివాహ బంధంతో ముడిపడిన మన అనుబంధం శాశ్వతమవ్వాలి" తన హృదయాన్ని సున్నితంగా అతని ముందు పరిచింది మాలతి.

జగన్నాథం ఆమె ఆరాటాన్ని, అనురాగాన్ని అర్థం చేసుకున్నాడు. "నేను నీ వాడినే. ఎప్పటికీ నీ వాడినే మాలతీ."

భార్య తనని గాఢంగా ప్రేమిస్తున్నది - అన్న భావన మగాడికెంతో ఉల్లాసాన్ని కలుగజేస్తుంది. బదులుగా తనుకూడా ఆమెని అభిమానిస్తాడు. అయితే భార్య తన ప్రేమని, అనురాగాన్ని భర్త ముందు వ్యక్తం చేసే తీరులోనే చూపించాలి ఆమె చాకచక్యమంతా - అన్న విషయం మాలతి

తెలుసుకుంది.

కొన్ని క్షణాలాగి అన్నాడు "నిజంగా ఆ అమ్మాయిని ఇంత వరకు నేను సరిగ్గా చూడనేలేదు మాలతీ. ఆ అమ్మాయి గురించి ఎవరో ఏదో అన్నారే అనుకో - 'నా భర్త అలాంటివాడు కాదు. నా భర్త మీద నాకు పూర్తి నమ్మకముంది' అని నువ్వు చెప్పాలి. నిన్ను ఆటపట్టించడానికి రేపు ఇంకెవరన్నా ఏదన్నా చెప్పొచ్చు. ప్రతీదీ నమ్మేసి సీరియస్‌గా తీసుకుంటే ఎలాగ?" నచ్చజెప్తున్న ధోరణిలో అన్నాడు జగన్నాథం.

"నా గురించి ఎవరైనా ఏదైనా చెప్తే మీకు ఇలాకోపమో చిరాకో రాదా?" ఉక్రోషంగా అంది.

"పోనీ. ఇహ నుంచి నువ్వు ఎలా చెప్తే అలా వింటానని మాట ఇస్తున్నాను" అన్నాడు.

ఆ సంఘటన జరిగిన తర్వాత జగన్నాథంలో చాలా మార్పు వచ్చింది. హాస్యాని క్కూడా ఎప్పుడూ భార్య మనసుని కష్టపెట్టలేదు.

అలా, కృష్ణుడిలాంటి భర్తని రాముడిలా మార్చడానికి మాలతి చాలా కష్టపడింది.

★ ★ ★

"ఏంటి, మళ్లా ఆలోచనలో పడ్డావూ"- జగన్నాథం లోపలికొచ్చినట్టే తెలియనంత గాఢమైన స్మృతిలోంచి ఆ గొంతు విని బయట పడింది మాలతి.

"ఏం లేదు; మనిషి జీవితం మీద రాముడి నీడ గట్టిగా పడుతుందా కృష్ణుడిదా- అని ఎవరో చర్చపెడుతున్నారుట." అంది మాలతి చిరునవ్వుతో

★ ★ ★

*(వనితాజ్యోతి, మంత్లీ ; ఏప్రిల్ 1998)*